క్లుప్తంగా

వైద్య శిబిరం విజయవంతం

చర్ల: మండల కేంద్రమైన చర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమయింది. ఈ వైద్య శిబిరంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 850 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సుమారు రూ.6 లక్షల విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో భద్రాచలంలోని వివిధ ప్రైవేటు వైద్యశాలలకు చెందిన వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. చర్లకు చెందిన మర్ల రమేష్, ముగ్గుల రవీంద్రప్రసాద్, మేమున్నాం సహాయక సమితి, భద్రాచలంకు చెందిన మారుతీ పారా మెడికల్ అకాడమీల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వైద్య శిబిరాన్ని వచ్చిన రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేసి భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

ఆక్రమణ నుంచి స్థలాన్ని కాపాడాలి



పోస్టుమార్టం గది స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతున్న నాయకులు

చర్ల: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గతంలో ఉన్న పోస్టుమార్టం గది కూలిపోవడంతో ఆ గది స్థలాన్ని చుట్టూ ఉన్న స్థలాల యజమానులు ఆక్రమణలకు పాల్పడుతున్నారని, దానిని కాపాడాలని సీపీఎం (ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రజాపంథా పార్టీ నాయకులు ఆ ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణలకు గురవుతున్న తీరును పరిశీలించారు. గతంలో చర్లలో ప్రభుత్వ వైద్యశాల నిర్మించిన సందర్భంలో ఇక్కడ పోస్టుమార్టం గదిని నిర్మించారని, అది శిథిలావస్థకు చేరడంతో దానిని పూర్తిగా తొలగించారని ఆయన అన్నారు. ఈ క్రమంలో దానిని ఆక్రమించుకుంటున్నారని , అధికారులు స్పందించాలని అన్నారు. నాయకులు పాలెం చుక్కయ్య, మునిగెల శివ, సుజాత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థులు 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మణుగూరు వేణు ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎంతోకాలం తరువాత కలుసుకున్న వారంతా ఒక్కసారిగా చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ప్రస్తుతం వారు ఏమి చేస్తున్నారు వారి కుటుంబ విషయాలను గురించి చర్చించుకున్నారు. ఎంతో ఆప్యాయంగా సంతోషంగా గడిపారు. నాడు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు గణశంకర్ పూజారి, బలరాం మూర్తిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆషారాణి, లలిత, భాగ్యలక్ష్మి, జయశ్రీ, ఉపేంద్ర, విజయ్, కరీమ్, సర్వేశ్వరరావు, సత్యరమేష్‌లు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ



ఆలయ కమిటీకి వాటర్ కూలర్ అందజేస్తున్న పిచ్చేశ్వరరావు

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామంలో దక్షిణకాశి అష్టభైరవ నవగ్రహ స్వయంభూ చంద్రశిల శనీశ్వర ఆలయానికి ఆదివారం దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు దంపతులు వాటర్ కూలర్‌ను వితరణగా ఆలయ కమిటీ వారికి అందజేశారు. మండుతున్న ఎండల దృష్ట్యా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చల్లని తాగునీరు అందించేందుకు వాటర్ కూలర్ అందజేసినట్లు పిచ్చేశ్వరరావు తెలిపారు.

సీపీఐ నాయకుడి మృతి

అశ్వారావుపేటరూరల్: గుండె పోటుతో సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు ఆదివారం రాత్రి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..అశ్వారావుపేటలోని బండి సుబ్రహ్మణ్యం నగర్‌కు చెందిన తిర్నాటి సత్యనారాయణ(55) ఒక్కసారిగా గుండెలో నొప్పితో కుప్పకూలి పడిపోగా, గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కాగా సత్యనారాయణ విద్యార్థి దశ కార్మికులు, పేదల పక్షాన పోరాటాల్లో తనదైన పాత్ర పోషించారు. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం కూడా అశ్వారావుపేటలోని ఖమ్మం రోడ్‌లో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పోరాటం నిర్వహించగా, ఈ పోరాటంలో కూడా పాల్గొన్నారు. కొద్ది గంటల వ్యవధిలోనే ఇలా గుండెపోటుకు గురై మృత్యువాత పడటంతో విషాదం నెలకొంది. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నిబంధనలు బేఖాతరు

- జీపీలకు పన్నులు చెల్లించని సెల్ టవర్ల నిర్వాహకులు
- ఏటా రూ.1.50 లక్షలకు పైగా ఆదాయం కోల్పోతున్న జీపీలు
- వసూలు మరిచిన అధికారులు



రామాలయ అతిథి గృహాల వద్ద ఏర్పాటు చేసిన సెల్‌టవర్

భద్రాచలంఅర్బన్: ఒకప్పుడు పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన సెల్ టవర్లు నేడు చిన్న చిన్న గ్రామాలకు కూడా విస్తరించాయి. రోజు రోజుకూ పెరుగుతున్న సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌తో ప్రతి గ్రామంలో సెల్ ఫోన్‌లతోపాటు సెల్‌టవర్లు దర్శనమిస్తున్నాయి. ఈ సెల్ టవర్లు ఏర్పాటు చేయడానికి జీఓ నం.380 ప్రకారం పలు శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. సెల్ టవర్ల ఏర్పాటులో మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు చేసిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ జీఓను జారీ చేసింది. సెల్ టవర్ ఏర్పాటు చేసే స్థలం, లేదా భవనానికి సంబంధించి మున్సిపల్ లేదా పంచాయతీ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. సంబంధిత భవన యజమాని లేదా స్థల యజమాని అనుమతి తప్పనిసరి. వీటితో పాటు విద్యుత్ శాఖ కొన్ని సంబంధిత శాఖల నుంచి నో‌అబ్జెక్షన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ సర్టిఫికెట్లు పొందిన తర్వాతే గ్రామ పంచాయతీలు సెల్‌ఫోన్‌టవర్లకు అనుమతినివ్వాలి. తర్వాత ఆయా సెల్ కంపెనీలు ఇన్‌స్టాలేషన్ చార్జీల పేరిట పంచాయతీలకు పన్ను కట్టాల్సి ఉంటుంది.సెల్ టవర్ల వద్ద రక్షణ గోడలు నిర్మించాలి. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి. వివిధ రంగులతో కూడిన హెచ్చరిక బల్బులను ఏర్పాటు చేయాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. గ్రామ పంచాయతీ అనుమతి లేని భవనాలపై సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తుకు మాత్రమే అనుమతి తీసుకొని రెండు అంతస్తులు కట్టిన భవనాలపై కూడా సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. ఈ సెల్ టవర్ల ఏర్పాటుకు సంబంధించిన రికార్డులు గ్రామ పంచాయతీలో కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. జేబులోకి రూపాయొస్తే చాలు.. జనాలకేమైతే మాకేంటనే ధోరణి కార్పొరేట్ సంస్థల్లో కనిపిస్తోంది. ఇందుకు నిదర్శనంగా రోజురోజుకు పెరుగుతున్న సెల్‌టవర్లను చెప్పుకోవచ్చు. సొమ్ముల కోసం సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్న సంస్థలు నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నాయి. ఇటు జనాలకు ఇబ్బందులు కలిగిస్తున్నా, అటు నిబంధనలకు విరుద్ధంగా టవర్లు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వా ఆదాయానికి గండిపడుతున్నా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జనావాసాల మధ్య సెల్‌టవర్లు..

జనావాసాల మధ్యనే సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. సెల్ టవర్ల ద్వారా వచ్చే రేడియేషన్ల ద్వారా జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అనుమతులు, పన్నులు అనే అంశాలను జీఓలో చేర్చింది. భద్రాచలం పట్టణంలో దాదాపు 25 టవర్లకు పైగానే ఉండగా.. ఏర్పాటు సమయంలో సెల్ టవర్ యజమానులు పన్నులు చెల్లించిన దాఖలా ఒక్కటీ రెండు తప్పితే మిగిలిన వాటి దాఖలాలు లేవు. అలాగే ప్రతిఏటా గ్రామపంచాయతీలకు సెల్‌టవర్ నిర్వాహకులు టవర్ నిర్మాణాన్ని బట్టి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ వీటిపై సంబంధిత అధికారులకు అవగాహన లేకపన్నులు వసూలు చేయడం లేదు అనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

రూ.16 వేలు కట్టాలి..

సెల్ టవర్ నిర్మాణానికి ముందుగా టవర్ ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించిన పత్రాలతో పాటు గ్రామ పం చాయతీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. పంచాయతీకి రూ.16 వేలు రుసుము కట్టాల్సి ఉంది. డబ్బులు చెల్లించగానే రశీదు ఇచ్చి అక్కడున్న విస్తీర్ణాన్ని బట్టి ఏడాదికి ఎంత పన్ను అనేది అప్పుడే గుర్తించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఏడాదికీ పంచాయతీకి టవర్ నుంచి వచ్చే పన్ను కట్టించుకోవాలి. కానీ ఇక్కడ మాత్రం ఇలా జరుగు తుందా లేదా అనేది మాత్రం ఎవరికీ అర్థం కాని పరిస్థితి. దీంతో పంచాయతీకి రావాల్సినది మరిచిపోయి చేతులు దులుపుకుంటున్నారు.

అనుమతులిచ్చారు.. వసూళ్లు మరిచారు..

కోట్ల రూపాయాల్లో వ్యాపారం చేసుకుంటూ గ్రామ పంచాయతీలకు ఏడాదికొకసారి చెల్లించాల్సిన పన్నులను సెల్ టవర్ నిర్వాహకులు ఎగ్గొడుతున్నారు. భద్రాచలం పట్టణంలో పలు కంపెనీలకు చెందిన 25 సెల్ టవర్లకు పైగానే ఉన్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో వాటికి సంబంధించిన పన్నులు వసూలు కావడం లేదు. ఇంటీ పన్ను, ఇతరత్ర పన్నుల వసూలుపై వెంటపడే సిబ్బంది.. టవర్లకు సంబంధించిన పన్నుల వసూలుపై ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అంతు చిక్కడం లేదు. పట్టణంలో సెల్ టవర్ల మూలంగా ఏడాదికి రూ.1.50 లక్షలు పైగా ఆదాయాన్ని కోల్పోతున్నారు. పట్టణంలో సుమారు 25 టవర్లకు పైగానే ఉంటే. ఒక్కొక్క టవర్‌కు నాలుగైదు కంపెనీలకు చెందిన నెట్ వర్కర్ల టవర్లు ఉన్నాయి. ఆయా కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకుని ఒక్క టవర్ కే ఆయా కంపెనీలపరికరాలను ఏర్పాటు చేసుకుని కోట్లల్లో వ్యాపారం చేస్తున్నారు. టవర్ ఏర్పాటు చేసే స్థలంతో పాటు టవర్, జనరేటర్ గది కలిపి దాదాపు 150 గజాలు నుంచి 200 గజాల స్థలంలో ఉన్నాయి. పంచాయతీ లెక్క ప్రకారం ఏడాదికి కనీసం రూ. 2 వేలు వరకు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయంగా ఉన్న టవర్ల పన్నులను వీటి నిర్వాహకులు ఎగవేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం..



భద్రాచలం పట్టణంలోని సెల్ టవర్ల నిర్వాహకులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నాం. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో వీటికి సంబంధించి కొన్ని కంపెనీలు పన్నులు చెల్లించాయి. మరికొంత మంది నిర్వాహకులు పన్ను చెల్లించేందుకు సమయం అడగగా, మరికొంత మంది నిర్వాహకుల వివరాలు సేకరించి నోటీసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంటిపై ఏర్పాటు చేసే సెల్‌టవర్లకు సంబంధించి స్థానికులు సహకరిస్తేనే అనుమతిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలిగించే వాటికి అనుమతులు నిరాకరిస్తాం.

– మిక్కినేని వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ ఈఓ, భద్రాచలం

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఆదివారం సమితిసింగారం గ్రామపంచాయితీ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్, అశోక్‌నగర్, పూజారినగర్, వాగుమల్లారం, వెంకటపతినగర్‌లలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులతో పినపాక నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. అలాగే ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తూ పథకాలను అమలు చేస్తోందన్నారు. పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, సర్పంచ్ బచ్చల భారతి, ఎంపీటీసీ సభ్యులు, వార్డ్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలకు పోటెత్తిన భక్తులు



దుమ్ముగూడెం: భక్తులతో నిండి ఉన్న రామాలయం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాలలో గల సీతారామచంద్రస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులకు తోడు ఆదివారం కావడం వీటికి తోడు హనుమాన్ జయంతి కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో పర్ణశాల రామాలయం భక్తులతో కిటకిటలాడింది. భారీగా భక్తులు రానున్నట్లుగా ముందుగానే అంచనాకు వచ్చిన ఆలయ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. తాగునీరు, షామియానాలు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. బారీగా తరలివచ్చిన భక్తులతో రామాలయ పరిసరాలు కిక్కిరిసిపోగా, వాహనాలతో పార్కింగ్ ప్రదేశం కిటకిటలాడింది.

ముత్యాలమ్మ, మంగమ్మ తల్లి ఆలయాల్లో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం, గోగులపూడి అటవీ ప్రాంతంలోగల శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు అధిక సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవార్లను దర్శించుకొని వివిధ రకాల పూజలు చేశారు. అలాగే అమ్మవార్లకు మొక్కలు చెల్లించుకొని, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. వేసవి సెలవులు కావడంతో ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులతో ఆలయా పరిసరాలు సందడి మారాయి.

ఆర్థిక సాయం అందజేత

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీలోని శివలింగాపురం గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం సీనియర్ నాయకులు గమిడి వెంకటేశ్వర్లు శనివారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మణుగూరు మున్నూరుకాపు సంఘం నాయకులు ఆదివారం వారి ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతుని దహన సంస్కారాలకు, దశదినకర్మల ఖర్చుల నిమిత్తం సంఘం ద్వారా రూ.20,700లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వన్నం కృష్ణ మోహన్, గాండ్ల సురేష్, నాయకులు వలసాల వెంకటరామారావు, పసునూరి ఉప్పలయ్య, మానాది వెంకటయ్య, ఎడవల్లి వెంకటయ్య, ఎం దుర్గారావు, మాదాసు సాయిబాబా, ఎస్‌వీ నాయుడు, టి.శ్రీనివాస్, ఎల్ సాయిబాబా, పి.ముత్తయ్య, తులసి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భద్రాచలంటౌన్: మాతృ దినోత్సవం సందర్భంగా విద్యారంగంలో రాణిస్తున్న స్థానిక ప్రైవేటు విద్యా సంస్థల అధినేతలు మహాలక్ష్మి, వరలక్ష్మిలను రోటరీ క్లబ్, భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విరేశం, వసంతరావు, బ్రహ్మారెడ్డి, రాజారెడ్డి, వీరయ్య, నాగేశ్వరరావు, మధు, యూసఫ్, సాగర్, అజీమ్, శంకర్ రెడ్డి, పాషా, బాలాజీ, రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు విప్ సన్మానం

మణుగూరురూరల్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అరుణోదయ విద్యాలయం విద్యార్థులను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో కూడా చదువులో రాణిస్తూ.. తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, పాఠశాల కరస్పాండెంట్ అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్

చర్ల: ఈ నెల 16న భద్రాచలంలో జరిగే సీపీఐ భద్రాచలం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన చర్లలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 16న భద్రాచలం పట్టణంలోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేయనున్న నియోజక వర్గ స్థాయి సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ మండల కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు ముఖ్య కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. పార్టీ కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి షాబీర్ పాషాలతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నూపా పోతయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల సహాయ కార్యదర్శి కొంగూరు రాము తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



అశ్వాపురం: కుటుంబ సభ్యులతో వీఓఏల దీక్షలు

బూర్గంపాడు: ఆడబిడ్డలకు అండగా ఉన్నామని చెప్పుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వానికి గ్రామదీపికలు ఆడబిడ్డల్లా కనిపించటంలేదా అని సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య ప్రశ్నించారు. గ్రామదీపికల డిమాండ్లను పరిష్కరించాలని 28 రోజులుగా నిరసన చేపట్టిన ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవటం దారుణమన్నారు. ఆదివారం గ్రామదీపికలకు ముఖ్యమంత్రికి పోస్టుకార్డుల ద్వారా నిరసన వ్యక్తం చేశారు. మద్దతుగా తిరుపతయ్య నిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. గ్రామదీపికల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామదీపికల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీలక్ష్మి, విమలావతి, కమాల్‌బి, పాపారావు, వసంత, దాసరి రమణ, సాగరిక, పోతిరెడ్డి లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న వీఓఏలు మండల కేంద్రంలో 28వ రోజు దీక్షలు కొనసాగించారు. ఆదివారం వీఓఏలు కుటుంబసభ్యులు, పిల్లలతో కలిసి దీక్షలు చేశారు.

ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి మా సమస్యలు పరిష్కరించి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ దీక్షల్లో వీఓఏలు సురకంటి అరుణ, వేల్పుల కవిత, తూము సుమలత, శ్రీలత, రమాదేవి, సత్యవాణి, లత, సమ్మక్క, సుగుణ, వాణి, రాజకుమారి, వీఓఏలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

బూర్గంపాడు: మదర్స్ డే సందర్భంగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో యడమకంటి పెద్దరోశిరెడ్డి దంపతులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఆదివారం రోశిరెడ్డి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించి మాతృప్రేమను చాటుకున్నారు. గ్రామస్తుల సమక్షంలో తల్లిదండ్రులకు పాదపూజ చేసి కుటుంబ సభ్యులు, బంధువులు వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రోశిరెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు దైవంతో సమానమని, వారికి సేవలు చేసుకునే భాగ్యం దక్కటం పూర్వజన్మ సుకృతమన్నారు. కాశీనాయన స్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

'చలో హైదరాబాద్' వాయిదా

చర్ల: గిరిజన సంక్షేమ శాఖలో నెలకొన్న అవినీతి, అక్రమాలపై విచారణ నిర్వహించాలన్న డిమాండ్‌తో ఈ నెల 15న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యాక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనేది తెలియజేస్తామని ఆయన తెలిపారు.

ఉచిత మజ్జిగ పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీ క్రాస్‌రోడ్డులో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా వాసవిక్లబ్, వాసవి వనితా వైభవ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వాసవీక్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమంలో ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కిరాణామర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దోసపాటి నాగేశ్వరరావు, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వి160ఏ రీజియన్-1 చైర్మన్ చిత్తలూరి రమేష్‌బాబు, కార్యదర్శి చిత్తలూరి ఉమా, డిస్ట్రిక్ట్ కే సీజీఎఫ్ ఇన్‌చార్జ్ బండారి నరసింహారావు, క్లబ్ అధ్యక్షులు శేషబాబు, కార్యదర్శి రాకేష్, వనితా క్లబ్ అధ్యక్షుడు నాగరత్నమణి, కార్యదర్శి స్వర్ణలత, కోశాధికారి మానస, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా తెలుగుదేశం

దమ్మపేట: ఇంటింటా తెలుగుదేశం ప్రచార కార్యక్రమాన్ని పార్టీ ఇన్‌చార్జ్ కట్రం స్వామిదొర ఆధ్వర్యంలో మండలంలోని నాగుపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఆదివారం నాగుపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వలీపాషా, నార్లపాటి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వంశీ పుష్పారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్టర్ల బదిలీని నిలిపివేయాలి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా కొండాపురం భూగర్భగనిలో పనిచేస్తున్న ఫిట్టర్ల బదిలీలు నిలిపివేయాలని కోరుతూ ఆదివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్ జి.వెంకటేశ్వరరెడ్డికి టీబీజీకెఎస్ నేతలు వి.ప్రభాకర్ రావు సారథ్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా టీబీజీకెఎస్ బ్రాంచ్ ఉపాధ్యాక్షుడు వి.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనలో మణుగూరు ఏరియాను ప్రథమ స్థానంలో నిలుపుతున్న మణుగూరు ఏరియా ఫిట్టర్లను బదిలీ అనే పదంతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో.. మానవ దృక్పథంతో వారిని మణుగూరు ఏరియాకు తీసుకొచ్చినట్లు, ఇప్పుడు మళ్లీ బదిలీ చేస్తామనడంతో ఆ కుటుంబాలను ఆందోళనలో పడ్డాయన్నారు. వెంటనే వారి బదిలీలు నిలిపి వేసి ఆకుటుంబాలను ఆదుకోవాలని డైరెక్టర్‌కు తెలంగాణ బొగ్గుగని నేతలు విన్నవించారు. టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవూఫ్, బ్రాంచి నాయకులు వీరభద్రయ్య, కాపా శివాజీ, కొండాపురం భూగర్భగని పిట్‌సెక్రటరీ వెంకట్, రామారావు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి



అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనాలపై శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం హనుమత్ జయంతిని పురస్కరించుకుని కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్చకులు ఆలయాల్లో అభిషేకాలు, సహస్రనామార్చనలు చేపట్టారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. దేశం సుభిక్షంగా ఉండాలని సీతారాముడి ఆలయాల్లో శాంతి కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు చేశారు. శ్రోతలకు హనుమాన్ చాలీసా వినిపించారు. భక్తులు, యువత కలిసి పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: సీతారామచంద్ర స్వామి శాంతి కల్యాణం..



బూర్గంపాడు: వేదపండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



దమ్మపేట: హనుమాన్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



భద్రాచలంటౌన్: స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య



ములకలపల్లి: పూజలు చేస్తున్న భక్తులు



అన్నపురెడ్డిపల్లి: స్వామివారికి అభిషేకం..